సాక్షి
ఖమ్మం
మంగళవారం । 3 । జనవరి । 2023



## రామయ్య దర్శనం.. ముక్కోటి దేవతల పుణ్యఫలం

ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనం నయనానందకరంగా సాగింది. వైకుంఠంలో ఈ ఏకాదశి రోజున స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని, అందుకు వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం సిద్ధిస్తుందని వేద పండితులు చెబుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠం నుంచి సరాసరి భద్రగిరిపై ప్రత్యక్షమైన స్వామివారిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగిపోయి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.



మరికొన్ని ఫొటోలు 8లో

ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో తెరుచుకుంటున్న ఉత్తర ద్వారం










ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న సీతారామ లక్ష్మణులు

# భూలోక వైకుంఠమే..



శ్రీ సీతారామచంద్రస్వామి వారికి మహా హారతి ఇస్తున్న అర్చకులు

**భద్రాద్రిలో వైభవోపేతంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు**

- నేత్ర పర్వంగా సాగిన ఉత్తరద్వార దర్శనం
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- కనుల పండువగా తిరువీధి సేవ
- తిలకించి.. పులకించిన భక్తజనం

భద్రాచలం: వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ధూపదీపాల నడుమ జయ గంటలు మార్మోగుతుండగా భద్రాద్రి రామయ్య ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సమయాన భద్రగిరి సాక్షాత్తూ భూలోక వైకుంఠమే అయింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రామచంద్రస్వామి గరుడ వాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ద్వారం వద్దకు వేంచేశారు. ఒకవైపు దివ్యతేజంతో వెలుగొందుతున్న రామయ్య స్వామి, మరోవైపు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న రామాలయ ప్రాంగణాన్ని చూసిన భక్తులు పరవశించిపోయారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని కనులారా చూసి జయ జయ ధ్వానాలు చేశారు.

**తెల్లవారుజామున 5 గంటలకు..**

ఉత్తర ద్వార దర్శనానికి ముందు శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు గావించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారిని ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకొచ్చారు. తొలుత ఆలయ ఆస్థాన విద్వాంసులు శ్రీరామ కీర్తనలను ఆలపించారు. అనంతరం స్థానాచార్యులు కేశఈ స్థలశాయి వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతను తెలియజేశారు. సరిగ్గా 5 గంటలకు వివిధ మంగళ వాయిద్య గంట మోగుతుండగా వేదఘోషల నడుమ వైకుంఠ ద్వారం తలుపులు తెరుచుకున్నాయి.

**వైభవంగా తిరువీధి సేవ..**

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరి వెళ్లారు. గరుడ వాహనంపై స్వామి వారు, గజ వాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి రాజవీధి మీదుగా తాత గుడి వరకు తిరువీధి సేవకు వెళ్లగా వారికి ముందు చలువ చప్రంలపై ఆండాళ్, ఆళ్వార్ దేవతలు ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారి వెంట నడవగా గోవిందరాజ స్వామివారి ఆలయం వరకు వెళ్లిన స్వామి వారు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం తిరిగి రాజ వీధి మీదుగా గ్రామోత్సవం ద్వారా ఆలయానికి చేరుకున్నారు.

**మార్మోగిన రామనామం..**

ముక్కోటి సందర్భంగా మిథిలాస్టేడియం ప్రాంగణ పరిసరాలు 'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' నామస్మరణలతో మార్మోగాయి. నేత్రపర్వంగా సాగిన ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పావన గోదావరి నదిలో ఆదివారం రాత్రి జరిగిన స్వామి వారి తెప్పోత్సవం వేడుకలను చూసిన భక్తులంతా రాత్రి భద్రాచలంలోనే బస చేసి సోమవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ద్వారా వైకుంఠ రాముడిని తిలకించారు. ఆ కమనీయ ఘట్టాన్ని కనులారా చూసేందుకు చలిని కూడా లెక్క చేయకుండా తెల్ల వారుజామున రెండు గంటల నుంచే ఉత్తర ద్వారం వద్దకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, హరిప్రియ, లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దంపతులు, సంగారెడ్డి కలెక్టర్ శరత్, ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య, మాజీ మంత్రి బలరాంనాయక్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, ఆలయ ఈఓ శివాజీ, ఆర్డీఓ రత్నకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

**పరవశించిన భక్తులు..**

వైకుంఠాన్ని మైమరిపించేలా ప్రత్యేకంగా అలంకరించిన ఉత్తర ద్వారంలో ధూప, దీపాల నడుమ శ్రీ సీతా లక్ష్మణ సమేతంగా దర్శనమిచ్చిన రామచంద్రస్వామిని తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఉత్తర ద్వారంలో గంటసేపు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ సహస్ర నామార్చన నిర్వహించారు. వివిధ రకాల ఫలాలు నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించారు. ఆ తర్వాత వేదపారాయణం నిర్వహించారు. రుగ్వేద, యజుర్వేద, సామ, అధర్వన వేదాలను పండింతులు పఠించారు. అనంతరం 108 ఒత్తులతో కూడిన హారతిని స్వామివారికి ఇచ్చారు. శరణాగతి, దండకం అనంతరం ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు.



ఉత్తర ద్వార దర్శనానికి భారీగా హాజరైన భక్తులు

## న్యూస్‌రీల్

### హోంగార్డు ఆఫీసర్లకు మెడికల్ బిల్లులు



చెక్కు అందజేస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం : జిల్లాలోని పలువురు హోంగార్డు ఆఫీసర్లకు సీపీ విష్ణు ఎస్.వారియర్ సోమవారం మెడికల్ బిల్లులు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హోంగార్డులకు మంజూరైన మెడికల్ బిల్లుల చెక్కులతో పాటు విధి నిర్వహణలో భాగంగా మృతి చెందిన హోంగార్డు కుటుంబాలకు చెక్కులను సీపీ అందజేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఏఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఆర్‌ఐలు శ్రీశైలం, హోంగార్డు అసోసియేషన్ నాయకులు రఫీ పాల్గొన్నారు.

### రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్ : ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఈనెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. 18నుంచి 30 ఏళ్ల వయస్సు ఉండి ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. సుమారు 200 మంది ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళా టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మొదలవుతుందని తెలిపారు.

### జిల్లాకు 31 మంది వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాకు 31 మంది రెగ్యులర్ వైద్యాధికారులను వైద్య ఆరోగ్య సంచాలకులు కేటాయించారని డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. దీంతో నగరంలోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, గంగారం, బనిగండ్లపాడు పీహెచ్‌సీలు మినహా అన్ని పీహెచ్‌సీలకు మంజూరైన వైద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. ఈమేరకు కొత్తగా నియమితులైన వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆమె సూచించారు.

## నూతనోత్సాహంతో పనిచేయండి

**కలెక్టర్ వీ.పీ.గౌతమ్**



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: అన్ని శాఖల అధికారులు గత ఏడాది మాదిరిగానే కొత్త సంవత్సరంలోనూ శ్రద్ధగా విధులు నిర్వర్తిస్తూ పనుల్లో మరింత పురోగతి కనిపించేలా కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన పీఎంఏజేఏవై, దళితబంధుతో పాటు వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన కింద గ్రామాలను ఎంపిక చేసి రూ.20 లక్షల నిధులు ఇవ్వనున్నందున మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ నిధులతో సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని చెప్పారు. ఇక దళితబంధు మిగులు యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని, ఉత్పాదక యూనిట్లలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ అవసరాలకు స్థలాల కేటాయింపుపై సూచనలు చేశారు. ఇంకా టీఎం–33 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, పీఓబీ, రెవెన్యూ సమస్యల దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు.

**ఫిర్యాదులను పరిష్కరించాలి**

ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్‌డే)లో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కాగా, రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులతో పాటు ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తులు ఎక్కువగా అందాయి. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఆర్డీఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 4వ తేదీ నుంచి ఐదో సెమిస్టర్, 5నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 సెంటర్లు ఏర్పాటుచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. అన్నికేంద్రాల్లో పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రశ్నాపత్రాలు ఆన్‌లైన్‌లో పది నిమిషాల ముందు పంపిస్తామని, ఏ రోజుకారోజే జవాబుపత్రాలను యూనివర్సిటీకి పంపాలని ఆదేశించారు.

## ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించండి



కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా కాంటా పూర్తికాగానే మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి.సోములు ఆదేశించారు. మండలంలోని విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్ఓ) రాజేందర్‌తో కలిసి సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయగా, రైతులు మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అయితే, కేంద్రంలో ఆరు లారీల మేర ధాన్యం ఉండడంతో సీఈఓ బొల్లు హన్మంతరావును ఆరా తీయగా ఇప్పటికే కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈమేరకు లారీ కాంట్రాక్టర్‌తో డీఎస్ఓ మాట్లాడి ఆరు లారీలు పంపించాలని ఆదేశించారు. ఏఈఓ షాహీనా, కేంద్రం ఇన్‌చార్జ్ ఉండం సాంబశివరావుతో పాటు వడ్డె రామారావు, దమ్మాలపాటి రాంబాబు, బొల్లు శ్రీనివాసరావు, యాకూబ్‌పాషా, తాతా వేణు, షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ వైపే ముస్లిం మైనార్టీలు

- పదవి వచ్చినోడికే కడుపునొప్పి
- కాంగ్రెస్ కారణంగానే రాష్ట్రాల్లో బీజేపీ బలపడుతోంది
- మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి అజయ్‌కుమార్



ముస్లిం మైనార్టీల సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ, తదితరులు



కమిషనర్‌కు సూచనలు చేస్తూ..

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఎక్కువశాతం మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేవారని, తెలంగాణ ఏర్పడ్డాక మాత్రం మైనార్టీలంతా బీఆర్‌ఎస్‌ను నమ్ముతూ పార్టీ వెంటే ఉన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని షాదీఖానాలో సోమవారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మంకు ఓ ప్రత్యేకత ఉందని.. ఇక్కడ ముస్లింలు, హిందువులు, క్రైస్తవులంతా కలిసి మెలసి ఉంటారని తెలిపారు. ఖమ్మం మతతత్వ పార్టీలకు వేదిక కాకూడదని పిలుపునిచ్చారు. కొందరికి అర్హత ఉండి పదవులు రాకున్నా బాధ్యతతో వ్యవహరిస్తుండగా మరికొందరికి పదవులు వచ్చినా కడుపునొప్పి ఉందని చెప్పారు. కేఎంసీ ఎన్నికల సందర్భంగా 54 మందికి కార్పొరేటర్ టికెట్లు ఇవ్వడానికి.. 500 మంది కడుపులో తలపెట్టి బతిమిలాడానని గుర్తుచేశారు. ముస్లిం మైనార్టీలకు ఐదు టికెట్లు ఇచ్చి అందరినీ గెలిపించుకున్నామని చెప్పారు. కాగా, ఖమ్మం మార్కెట్‌కు కొత్త పాలకవర్గంలో వైస్ చైర్మన్‌గా అఫ్జల్ మియాను నియమించనున్నట్లు మంత్రి అజయ్ ప్రకటించారు.

**ప్రధాన ప్రతిపక్షం లేకే....**

కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించి ఉంటే ఈరోజు ఇన్ని రాష్ట్రాల్లో బీజేపీ బలపడేది కాదని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. అందుకే బీఆర్‌ఎస్ బీజేపీని నిలువరించేందుకు యత్నిస్తున్నందున మతతత్వ శక్తుల విషయంలో ముస్లిం యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పథకాలు, పదవుల కోసం కాకుండా తనకు ఆత్మీయులైన ముస్లిం మైనార్టీలతో మొదటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనను అజయ్‌ఖాన్ అని ట్రోల్ చేయడాన్ని గర్వపడుతున్నానని చెప్పారు. వచ్చేవారు వస్తారు.. పోయేవారు పోతారని.. ఈ భూమి పుత్రుడు ఎవరో గుర్తుంచుకోవాలని కోరారు. తొలుత పలు వురు ముస్లిం నేతలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇచ్చి అజయ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని పిలుపునివ్వగా, పలు వురు మంత్రి సమక్షాన పార్టీలో చేరారు. ఈ సమ్మేళనంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్ మక్బూల్, మాజీ కార్పొరేటర్ షౌకత్‌అలీ, టీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మార్కెట్ చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్నతో పాటు ఖమర్, తాజుద్దీన్, ఇషాక్, జహీర్‌అలీ, షకీనా తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు సత్వరమే పరిష్కరించండి**

సమస్యలపై ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులకు సూచించారు. 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా సోమవారం 38వ డివిజన్ ఖిల్లాలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్‌లో పూర్వ బావి, రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్లు, అసంపూర్తిగా డ్రెయినేజీలు, ఆసరా పింఛన్లు తదితర అంశాలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే, ప్రభుత్వ ఉర్దూ పాఠశాలను మంత్రి సందర్శించి సౌకర్యాల కల్పనకు సీడీపీ నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కాగా, వాడవాడకు పువ్వాడ కార్యక్రమంలో గుర్తించే సమస్యల పరిష్కారానికి మంత్రి కేటీఆర్ రూ.20 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కమిషనర్ ఆదర్శ్ సురభి, మార్కెట్ చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఆర్డీఓ రవీంద్రనాథ్, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఈఈలు కృష్ణాలాల్, రంజిత్, డీఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జమలాపురంలో వేడుకగా 'ముక్కోటి'

- ఉత్తర ద్వారం గుండా స్వామి దర్శనానికి బారులు
- ఒక్కరోజే రూ.3.27లక్షల ఆదాయం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం వేడుకగా జరిగింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన సుమారు 10వేల మంది భక్తులు తెల్లవారుజామున స్వామిని ఉత్తర ద్వారం మీదుగా దర్శించుకున్నారు. తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకం చేయగా, ముక్కోటి విశిష్టతను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణం నిర్వహించారు. ఆతర్వాత ఉత్తర ద్వారం వద్ద మండపంపైకి ఉత్సవ విగ్రహాలను చేర్చారు. ప్రసాదాల అమ్మకం, వాహనపూజలు, తలనీలాల టికెట్ల ద్వారా ఆలయానికి ఒకేరోజు రూ.3.27 లక్షల ఆదాయం సమకూరింది. కాగా, ఆకునూరి రాంబాబు–జయసుధ దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేయగా, ఎస్సై సురేష్ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, సర్పంచ్ ముల్పూరి స్వప్నకుమారి, సొసైటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీటీసీ శైలజతో పాటు తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల, వేంజర్ల సాయికుమార్, శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు పూజ చేస్తున్న అర్చకులు


ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) ఉత్తర ద్వారంలో సీతారామలక్ష్మణమూర్తులు..


మిథిలా స్టేడియంలో భక్తుల సందడి


కీర్తనలు ఆలపిస్తున్న విద్వాంసులు


పుర వీధుల్లో స్వామి వారి ఊరేగింపు..


ఉత్తర ద్వారం మెట్ల వద్ద బారులుదీరిన భక్తజనం

# ముక్కోటి పుణ్యఫలం..

వేదపండితుల మంత్రోచ్ఛరణలు..
ధూపదీపాలు.. జయ జయ ధ్వానాల నడుమ
శ్రీసీతారామ చంద్రస్వామివారు దర్శనమివ్వగా...
అప్పటికే వేయి కళ్లతో వేచి చూస్తున్న భక్తులు
కనులారా వీక్షించి.. భక్తిభావంతో ఉప్పొంగారు.
మంగళ వాయిద్యాలు మోగుతుండగా..
వైకుంఠ ద్వారం తెరుచుకున్న క్షణాన
దివ్యతేజస్సుతో సాక్షాత్కారించిన
రామయ్యను చూసి భద్రగిరి క్షేత్రం పులకించింది.
ఉత్తర ద్వార దర్శనంతో ముక్కోటి దేవతలను
దర్శించుకున్నంత పుణ్యఫలం సిద్ధిస్తుందని
వేద పండితులు పేర్కొన్నారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్


హాజరైన భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ తాతా మధు


రాముల వారితో సెల్ఫీ..


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్, పక్కన ములుగు కలెక్టర్ కృష్ణాదిత్య


వేడుకలకు హాజరైన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ


జై శ్రీరామ్..


స్వామివారి దర్శనానికొచ్చిన దివ్యాంగుడు..

## క్లుప్తంగా

### స్ఫూర్తిప్రదాత ఏ.బీ.బర్ధన్


బర్ధన్ చిత్రపటం నివాళులర్పిస్తున్న నాయకులు

**ఖమ్మంమయూరిసెంటర్:** దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో నిబద్ధత కలిగిన నాయకుడైన సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ.బీ.బర్ధన్ స్ఫూర్తిప్రదాతగా నిలిచారని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. బర్ధన్ వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకుడు మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామిక దేశంలో మతపరమైన పాలన సాగుతున్న నేపథ్యాన మతోన్మాద వ్యతిరేక ఉద్యమానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సీహెచ్.సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, పి.ఏసు తదితరులు పాల్గొన్నారు.

### 5, 6వ తేదీల్లో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

**ఖమ్మం స్పోర్ట్స్ :** రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ బాలికల పోటీలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 5, 6వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. పాత పది జిల్లాలకు చెందిన 120మంది క్రీడాకారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పటేల్ స్టేడియంలో కోర్టును మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

**7, 8వ తేదీల్లో నెట్‌బాల్ టోర్నీ**

ఖమ్మంలో ఈనెల 7, 8వ తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించే ఈ పోటీలకు పాత పది జిల్లాలకు చెందిన 250 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని వెల్లడించారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జరిగే పోటీలకు ఏర్పాట్లు పూర్తికాగా, ఇక్కడ ప్రతిభ కనబరిచే వారితో రాష్ట్రజట్టును ఎంపిక చేస్తామని తెలిపారు.

### రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

**ఖమ్మంక్రైం :** మద్యానికి బానిసైన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం శ్రీనివాస్ నగర్‌కు చెందిన మేకల పవన్‌కుమార్(20) వాటర్ క్యాన్ల ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి మృతి చెందగా తల్లి లక్ష్మితో కలిసి ఉంటున్న ఆయన కొంతకాలంగా మద్యానికి బానిసై తరచు గొడవపడుతున్నాడు. ఈక్రమంలోనే వెంకటగిరి గేట్ వద్ద సోమవారం గూడ్స్ రైలు కిందపడి పవన్ ఆత్మహత్యకు చేసుకున్నాడు. అయితే, ఆయన పట్టాలపై పడుకుని ఉండగా అటుగా వచ్చిన గోపికృష్ణ అనే వ్యక్తి అరుస్తుండగానే గూడ్స్ పవన్ కాళ్ల పైనుంచి వెళ్లడంతో రెండు కాళ్లు విరిగి మృతి చెందాడు. మృతదేహన్ని అన్నం ఫౌండేషన్ సభ్యులు అమరేశ్వరరావు తదితరులు ఆస్పత్రికి తరలించారు.

## అక్రమంగా ఆయిల్‌పామ్ మొక్కల అమ్మకం

- దళారులు, మార్క్‌ఫెడ్ నర్సరీ సిబ్బంది నిర్వాకం
- మరోపక్క రైతులను దొంగలుగా చిత్రీకరించే యత్నం


మొక్కలను లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

**పెనుబల్లి:** ప్రభుత్వ ప్రోత్సాహకాలకు తోడు అధికారులు కల్పిస్తున్న అవగాహనతో ఆయిల్ పామ్ సాగుకు ముందుకొస్తున్న రైతుల ఆశలపై కొందరు దళారులు నీళ్లు చలుతున్నారు. మార్క్‌ఫెడ్ సిబ్బంది, నర్సరీ సెక్యూరిటీగా ఉన్న సిబ్బంది కలిసి రైతులకు దక్కాల్సిన ఆయిల్‌పామ్ మొక్కలను రాత్రికిరాత్రే పక్క రాష్ట్రం రైతులకు అమ్ముకుంటున్న విషయం వెలుగు చూసింది. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని నర్సరీ వద్ద బయటపడిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కుప్పెనకుంట్లలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నర్సరీ ఏర్పాటు చేసి 1.60లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను పెంచుతోంది. వీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న రైతులకు సీనియారిటీ ఆధారంగా ఇవ్వాల్సి ఉంది. అయితే, అశ్వారావుపేట సరిహద్దు ఏపీలోని చింతలపూడి రైతులు ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపుతుండడంతో దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు మార్క్‌ఫెడ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో ఒక్కో మొక్కను రూ.350 నుండి రూ.450 వరకు ఇస్తామంటూ నమ్మబలికి రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఐదు వాహనాల్లో మొక్కలను తరలించే ప్రయత్నం చేశారు. రెండు వాహనాల్లో మొక్కలు తీసుకెళ్లాక, మిగిలిన మూడు వాహనాల్లో మొక్కలు లోడ్ చేస్తుండగా స్థానిక రైతులు గుర్తించి వీఎం బంజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అర్ధరాత్రి కుప్పెనకుంట్లకు చేరుకుని వాహనాలు, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇక మార్క్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ సోమవారం చేరుకుని ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొక్కల అక్రమ రవాణాకు తమ శాఖ, నర్సరీ సిబ్బంది ఎవరెవరు సహకరిస్తున్నారో విచారణ చేపట్టాలని కోరారు. కాగా, డిసెంబర్ 21న సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య మొక్కల పంపిణీని ప్రారంభించగా, 1.60లక్షల మొక్కల్లో సోమవారం నాటికి 97 వేల మొక్కలను రైతులకు పంపిణీ చేసినట్లు బాలకృష్ణ తెలిపారు. అయితే, 10 వేల వరకు మొక్కలను అక్రమంగా తరలించి ఉంటారని రైతులు ఆరోపిస్తుండగా, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

**నెపం రైతులపైకి నెట్టేలా...**

ఆయిల్‌పామ్ మొక్కలు అమ్ముతామని చింతపూడి రైతులను నమ్మబలికిన దళారులు ఇప్పటికే అశ్వారావుపేటకు చెందిన ఎరువుల దుకాణం వ్యాపారి, సెక్యూరిటీ గార్డుకు నగదు ఇచ్చినట్లు సమాచారం. ఇంతలోనే విషయం బయటపడడంతో ఏపీ రైతులు, వాహనాల డ్రైవర్లే దొంగతనంగా వచ్చి మొక్కలు తీసుకెళ్తున్నట్లు నెపం వారిపైకి మోపేందుకు మార్క్‌ఫెడ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు పోలీసులు లోతైన విచారణ చేపట్టాలని రైతులు కోరారు.

## వంద కి.మీ. వరకు ఉచిత అంబులెన్స్


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

**సత్తుపల్లి:** సత్తుపల్లికి చెందిన బైక్ మెకానిక్ అజార్ వంద కిలోమీటర్ల దూరం వరకు ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, అంబులెన్స్ సేవలను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని పవన్, నాని, ఎం.డీ.యాసీర్, వెంకటేశ్వరరావు, పంతంగి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనం, సీఎంకు శుభాకాంక్షలు


సీఎంకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ, మంత్రి

**ఖమ్మం మయూరిసెంటర్:** తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుటుంబంతో సహా తిరుమల వెళ్లిన ఎంపీ... సోమవారం తెల్లవారుజామున ఉత్తర ద్వారం గుండా శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇక సాయంత్రం మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కలిసిన ఎంపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు బీజేపీ ఓబీసీ మోర్చా శిక్షణ తరగతులు

**చుంచుపల్లి:** ఉమ్మడి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా శిక్షణ తరగతులు మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు తెలిపారు. శిక్షణ తరగతులకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ తదితరులు హాజరై మాట్లాడుతారని ఆయన వెల్లడించారు.

## విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

**ఖమ్మం లీగల్:** అక్రమంగా విద్యుత్ వాడుకున్న కేసులో ఓ వ్యక్తికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన ఏపూరి ఉపేందర్ తన ఇంటికి అక్రమంగా కరెంట్ వాడుకుంటుండగా 2019 సెప్టెంబర్ 27న విద్యుత్ అధికారుల తనిఖీల్లో గుర్తించారు. ఖమ్మం విద్యుత్ విజిలెన్స్ అధికారులు, పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రూ.7,025 జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డేనీరూథ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా, ఏపీటీసీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, పీసీ నరుకుళ్ల కరుణాకర్‌రావు, హోంగార్డు అయూబ్ సహకరించారు.



## గాంధీ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**ఖమ్మంసహకారనగర్:** పంచాయతీల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్రప్రభుత్వం గాంధీ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం స్థానికసంస్థలపై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సోమవారం జిల్లా కేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు కేటాయించిన నిధులను రాష్ట్రప్రభుత్వం ఇతర అకౌంట్లకు బదిలీ చేస్తోందని తెలిపారు. స్థానిక సంస్థలు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రోజ్ గార్ యోజన పథకం తీసుకొస్తే, ప్రస్తుత ప్రభుత్వం అన్ని పథకాలను నీరుగారుస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ నిధులు విడుదల కాక సర్పంచ్‌ల అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే నారాయణరావు, గజ్జెల్లి వెంకన్న, బాణాల లక్ష్మణ్, అబ్బాస్, మద్ది వీరారెడ్డి, వసీం, ఏలూరి రవికుమార్, కిరణ్, పాలకుర్తి నాగేశ్వరరావు, అంజనీకుమార్, బచ్చలకూర నాగరాజు, రమణచౌదరి, వెంకటకృష్ణ, రియాజ్, యశ్వంత్, సాయి, అమరనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకోం..


కృష్ణయ్య విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**ఖమ్మంరూరల్/ఖమ్మం మామిళ్లగూడెం:** బీజేపీ నాయకులపై దాడులు చేస్తామని సీపీఎం నాయకులు చెబుతున్నారని, అదే జరిగితే చూస్తూ ఊరుకోబోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లిలో ఇటీవల హత్యకు గురైన తమ్మినేని కృష్ణయ్య విగ్రహం వద్ద సోమవారం నాయకులు నివాళులర్పించారు. అనంతరం గల్లా మాట్లాడుతూ ఇటీవల జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా పథకాన్ని కేరళలో అమలు చేస్తుండగా, తెలంగాణ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన కమ్యూనిస్టులు వారి ఉనికి చాటుకునేందుకు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాగా, తొలుత ఖమ్మం నుంచి తెల్దారుపల్లికి బయలుదేరిన ర్యాలీని సత్యనారాయణ ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్‌తో పాటు నాయకులు బి.నాగరాజు, ఉపేందర్, కిరణ్, వీరభద్రం, మార్తి వీరభద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, నకిరికంటి వీరభద్రం, ఉపేందర్, కార్తీక్, చావా కిరణ్, కోటేశ్వరావు, శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై దాడి.. గొలుసు చోరీ

**తిరుమలాయపాలెం:** మండల కేంద్రానికి సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద హిజ్రాల పేరుతో ఆటోలో వచ్చిన నలుగురు ఓ ఉపాధ్యాయుడిపై దాడి చేసి రెండు తులాల బంగారు గొలుసు అపహరించారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుమలాయపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోటయ్య విధులు ముగించుకుని సోమవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బైక్‌పై ఖమ్మం బయలుదేరాడు. కొక్కిరేణి స్టేజీ సమీపాన ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ప్యాంట్లు, టీషర్ట్‌లు ధరించి నలుగురు ఆటోలో వచ్చి హిజ్రాలుగా చెబుతూ కోటయ్యను ఆపారు. డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆయన ఇచ్చి కాస్త దూరం వెళ్లే సరికి మెడలో చూసుకోగా రెండు తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆటోలో వచ్చిన వారు చోరీ చేసినట్లు గుర్తించి తిరిగొచ్చే సరికి వారు పరారయ్యారు. ఘటనపై కోటయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, పోలీస్‌స్టేషన్‌కి కొద్ది దూరంలోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

### తాళం వేసి ఉన్న ఇంట్లో..

**రూ.4లక్షలకు పైగా నగదు, ఆభరణాలు మాయం**

**ఖమ్మంఅర్బన్:** జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్-3లో తాళం వేసిన ఇంట్లో సోమవారం పట్టపగలు భారీ చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... వరి కోత మిషన్లు నడిపే ఇంటూరి నరేష్ ఉదయం పనిపై బయటకు వెళ్లగా, మధ్యాహ్నం 3గంటల సమయాన ఆయన భార్య మానస ఇంటికి తాళం వేసి బజార్‌కు వెళ్లింది. రాత్రి 7గంటలకు తిరిగి వచ్చేసరికి ప్రధాన తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించారు. ఈమేరకు బీరువాలో దాచిన రూ.4 లక్షలకు పైగా నగదు, భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు చేసిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణ, క్లూస్ టీం బృందం ఆధారాలు సేకరించారు. అయితే, ఎంత మేరకు చోరీ జరిగిందో బాధితులు ఇంకా వెల్లడించలేదని సీఐ తెలిపారు. కాగా, ఖమ్మం అర్బన్ స్టేషన్ ఎదురు కాలనీలో పట్టపగలే చోరీ జరగడం గమనార్హం. ఇటీవల తాళం వేసిన ఇళ్లలో చోరీలు నిత్యకృత్యం కాగా, స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇప్పుడు ఘటన జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట రూ.7లక్షలు లూటీ

**ఖమ్మంఅర్బన్:** ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.7లక్షలకు పైగా నగదు కాజేశారు. నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులో ఉండే ప్రత్యూష బీటెక్ పూర్తిచేయగా, ఇన్‌స్టాగ్రామ్‌లో గ్లోబల్ సిస్టమ్ పేరిట కొందరు సంప్రదించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించడంతో ఆమె రూ.7,09,337ను దఫాలుగా ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. ఆతర్వాత ఉద్యోగం ఇప్పించకపోవడంతో ప్రత్యూష ఫిర్యాదు చేయగా, ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.